
కొత్తచెరువు మండలం లక్ష్మీచెన్నకేశవపురంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

గోవిందా.. గోవింద..

వైభవంగా వైకుంఠ ఏకాదశి

కిక్కిరిసిన ఉత్తర ద్వారం

తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు

కదిరి, జనవరి10(ఆంధ్రజ్యోతి): గోవిందనామ స్మరణతో జిల్లాలోని వైష్ణవాలయాలు మార్మోగాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారం తెరుచుకుంది. స్వామి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి ముందే క్యూలైన్లలో చేరారు. భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి.

నవనారసింహక్షేత్రాల్లో ప్రసిద్ధిచెందిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి గురువారం రాత్రే భక్తులు చేరుకున్నారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున 2గంటల నుంచి ఆలయ అర్చకుడు స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. స్వామివారు పల్లకీలో తెల్లవారుజామున ఉత్తరగోపురం చేరుకున్నారు. పల్లకీని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి యశోదమ్మ, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు భక్తులు మోశారు. అనంతరం వారు స్వామివారినిదర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి మొదలైన ఉత్తరగోపురంలో స్వామివారి దర్శనం రాత్రివరకు కొనసాగింది. అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం దూర్పు రాజగోపురం నుంచి హిందూపురం క్రాస్‌వరకు బారులు తీరారు. శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామిని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి.. కుటుంబ సమేతంగా ఉత్తర గోపురంలో దర్శించుకున్నారు.


ఉత్తర గోపురంలో భక్తులకు దర్శనమిస్తున్న ఖాద్రీశుడు


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లో భక్తులు



శిక్షణ పూర్తి చేసుకున్న ఐఆర్‌ఎస్‌కు బంగారు పతకం ప్రదానం చేస్తున్న మంత్రి

అట్టహాసంగా..

నాసిన్‌లో ఐఆర్‌ఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్

హాజరైన కేంద్ర మంత్రి

గోరంట్ల, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామం వద్దగల ప్రతిష్టాత్మక కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కొటిక్స్ జాతీయ అకాడమీ (నాసిన్)లో శిక్షణ పొందిన ఐఆర్‌ఎస్ (భారత రెవెన్యూ సర్వీస్)ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కేంద్రం ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రికి కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. మంత్రి పరేడ్‌ను తిలకించి, ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ట్రైనీ అధికారులకు మంత్రి బంగారు పతకాలు ప్రదానం చేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఐఆర్‌ఎస్ శిక్షణ పూర్తిచేసుకున్నవారు దేశ నలుమూలల సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి ఓఎస్‌హెచ్ అల్కెస్ ఉత్తమ్, ఐపీఎస్ నీరజ్‌మిశ్రా, నాసిన్ అధికారులు పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

లేపాక్షి: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గావీరభద్ర, పాపనాశేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి దంపతులు సందర్శించారు. ఆలయ విశిష్టత, శిల్ప, చిత్రకళ చరిత్రను ఆలయ గైడ్ రఘు వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, నాట్యమండపాన్ని సందర్శించారు. వేలాడే స్తంభాన్ని పరిశీలించి, అమోఘంగా ఉందంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం ఆలయంలోని దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర మంత్రిని ఆలయ సిబ్బంది శాలువాలతో సత్కరించారు.


వేలాడే స్తంభాన్ని సందర్శిస్తున్న కేంద్ర మంత్రి

సమన్వయంతో

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై జిల్లా రవాణాశాఖ రూపొందించిన కరపత్రాలను స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్, ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ.. పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో అప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ర్యాలీలు సైతం చేపడతామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖాధికారులు కరుణసాగర్ రెడ్డి, వరప్రసాద్, రాణి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఎస్పీ

పాడి రైతుకు పండగ

జిల్లాలో గోకులం షెడ్ల ప్రారంభోత్సవాలు

మూడురోజులపాటు కార్యక్రమం



పుట్టపర్తి, జనవరి10(ఆంధ్రజ్యోతి): పాడి రైతుకు పండగొచ్చింది. అసలైన పండగొచ్చింది. పశువులు, మేకలు, గొర్రెల సంక్షరణకు అవసరమైన గోకులం షెడ్లను ప్రభుత్వం సబ్సిడీతో నిర్మించి ఇచ్చింది. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. నిర్మాణం పూర్తయిన వాటి ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడు రోజులపాటు కొనసాగనుంది. జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన 193 షెడ్లను తొలి దశలో ప్రారంభించనున్నారు.


కనగానపల్లి మండలం ముత్తవకుంట్లలో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

మూడురోజులపాటు ప్రారంభోత్సవాలు

పాడి పరిశ్రమకు మరింత చేయూతనివ్వాలని కూటమి ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వాటిని మంజూరు చేసింది. జిల్లాలో ఆసక్తిగల పాడి రైతుల నుంచి జూలైలో దరఖాస్తులు స్వీకరించింది. వెంటనే మంజూరు, చకచకా గోకులం షెడ్ల నిర్మాణ పనుల మొదలు పెట్టించారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయించి, ప్రారంభిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆదివారం దాకా ప్రారంభోత్సావాలు చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మినీగోకులం పథకాన్ని అటకెక్కించింది. పాడి పశువుల సంరక్షణ భారాన్ని రైతుపై మోపింది. కూటమి అధికారంలోకి రాగానే వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. మినీ గోకులం పథకాన్ని పునరుద్ధరించింది. షెడ్ల నిర్మాణాలకు పచ్చ జెండా ఊపింది. పనులు వేగవంతం చేయాలంటూ సబ్సిడీ నిధులు ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో శుక్రవారం నుంచి ఆదివారందాకా పల్లెపండగ పంచాయతీ వారోత్సవాల్లో మినీ గోకులం షెడ్లను ప్రారంభించనున్నారు.

రైతుకు లాభదాయకం

ప్రభుత్వం.. జిల్లాకు 1,325 మినీ గోకులం యూనిట్లను మంజూరు చేసింది. 1,311 షెడ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. వీటిలో 1,261 పనులు మొదలు పెట్టారు. వీటిలో 430 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మూడు రకాల యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.1.15 లక్షల నుంచి 2.30 లక్షల వరకు సబ్సిడీ నిర్ణయించింది. రైతు వాటాగా యూనిట్ విలువలో పది శాతం చెల్లించాల్సి ఉంటుంది. వీటిని జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేశారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి ఆసక్తిగల పాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యమిచ్చారు. గతేడాది జూలైలో జిల్లాలో అర్హులైన రైతులను ఎంపిక చేశారు. మినీ గోకులాలకు పోటీ పడడంతో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గోకులం షెడ్లు పాడి పశువులు, గొర్రెలు, మేకల సంరక్షణకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. తద్వారా రైతుకు లాభదాయకంగా మారుతున్నాయి.

పుట్టపర్తిలో అత్యధికం..

జిల్లాకు మంజూరైన మినీ గోకులాల్లో 430 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో 193 షెడ్లను తొలి దశలో ప్రారంభించనున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 72 నిర్మాణాలు పూర్తయ్యాయి. కదిరిలో 46, పెనుకొండలో 29, హిందూపురంలో 14, మడకశిరలో 15, రాప్తాడులో 17 ప్రారంభించనున్నారు. రైతుకు సబ్సిడీ అందించడంతోపాటు మినీ గోకులాల నిర్మాణం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న షెడ్లను పూర్తి చేసి మరోసారి ప్రారంభోత్సవాలు నిర్వహించాలని అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

మృత్యు మలుపులు..!

రోడ్డు క్రాసింగ్, స్పీడ్‌బ్రేకర్ల వద్ద రోడ్డు ప్రమాదాలు

- మృత్యువాత పడుతున్న కొందరు..
- ఆస్పత్రుల పాలవుతున్న ఇంకొందరు..
- కానరాని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మలుపుదారి చిగిచెర్ల వద్ద ఓబిరెడ్డి తోట వద్ద ఉంది. ఈ ప్రాంతంలో పూర్తి మలుపు ఉండటంతో అదికూడా కిందభాగం బ్రిడ్జి ఉండటంతో ఎటువంటి సైడ్‌వాల్స్ లేవు. దీంతో ధర్మవరం నుంచి అనంతపురం వెళ్లే వాహనదారులు వేగంగా వచ్చి మలుపు వద్ద వాహనం అదుపుకాక ఒకే వారంలో ముగ్గురు దుర్మరణం చెందారు. దీంతో ఒక కుటుంబం వారు వచ్చి 'ప్రమాదాన్ని గుర్తించండి' అంటూ ఆ ప్రాంతంలో హెల్మెట్ పెట్టి వెళ్లిపోయారు. ఈ మలుపువద్ద కనీసం స్పీడ్‌బ్రేకర్లుగానీ, సైడ్‌వాల్స్‌గానీ ఏర్పాటుచేయాలని ఎన్నిసార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.




ఈ చిత్రంలో కనిపిస్తున్న మలుపు గొల్లపల్లి క్రాస్ వద్ద ఉంది. ఈ క్రాస్ అనంతపురం, మరూరు జాతీయ రహదారికి వెళ్లేందుకు రెండు రోడ్లు కలుస్తాయి. ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి. దీనిని స్థానికులు డేంజర్ జోన్‌గా పిలుస్తారు. అదమరిచి వాహనం నడిపితే అంతే సంగతులు. ఈ ప్రాంతంలో కూడా ఎక్కడా స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు లేవు.

ధర్మవరంరూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): ఆ రహదారుల గుండా ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. నిత్యం ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మలుపులు, స్పీడుబ్రేకర్ల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ప్రధాన రహదారుల్లో స్పీడ్‌బ్రేకర్ల వద్ద సూచికబోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో వాహనదారులకు రాత్రివేళల్లో కనిపించక అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని ధర్మవరం నుంచి చిగిచెర్ల మీదుగా అనంతపురం వెళ్లే ప్రధాన రహదారి, ధర్మవరం నుంచి ఏలుకుంట్ల రహదారిలో నేలకోట సమీపంలో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారుల్లో ఎక్కడా ప్రమాదాలు తెలిపే సూచిక బోర్డులు లేవు. నిత్యం వందలాదిగా ద్విచక్రవాహనాలు, లారీలు, బస్సులు తిరుగుతుంటాయి. చిగిచెర్ల మీదుగా అనంతపురం వెళ్లే రహదారిలో గొల్లపల్లి క్రాస్, బడన్నపల్లి సమీపాన, గరుడంపల్లి క్రాస్ మలుపు వద్ద, చిగిచెర్ల బస్టాండ్ స్పీడ్‌బ్రేకర్ల వద్ద, చిగిచెర్ల సబ్‌స్టేషన్ ముందు మలుపు వద్ద, సీతారంపల్లి క్రాస్ జాతీయరహదారి, మల్లేనిపల్లి, తుమ్మల గ్రామాల మలుపుల వద్ద, నేలకోట సబ్‌స్టేషన్ మలుపుల వద్ద ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారుల్లో చీకటిపడగానే ద్విచక్రవాహనదారులకు చాలా దగ్గరకు వచ్చే వరకు ఆ రహదారుల్లో ఉన్న స్పీడ్‌బ్రేకర్లు కనిపించక వేగంతో ఆ ప్రాంతంలో అదుపుతప్పి కిందపడి ప్రమాదాలు జరగడానికి ఆ ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు ఉన్నట్లు ఎటువంటి సూచికబోర్డులు లేకపోవడంతో వాటితో పాటు బ్రేకర్ల వద్ద రేడియంస్టిక్కర్లు లేకపోవడంతో వాహనచోదకులకు కనిపించక ప్రాణాలు కోల్పోవుతున్నారు. ఇది వరకే గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వీటిపై తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరినా అధికారులు, పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఈ రహదారిలో కొత్తవారు ప్రయాణించేవారంతా ప్రమాదానికి గురవుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్ సూచికను తెలిసేవిధంగా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ రోడ్లలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొన్ని..

- గరుడంపల్లి క్రాస్ వద్ద గతనెల 31న అర్ధరాత్రి ధర్మవరం పట్టణానికి చెందిన బాబు కుటుంబసభ్యులు వాహనంలో వెళ్తూ మలుపువద్ద వేగంగా గుంతలోకి దూసుకెళ్లి అక్కడే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో కారు ఎయిర్ బాగ్స్ ఓపెన్‌కావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. కారు నుజ్జునుజ్జయింది.
- ఈనెల 1న ధర్మవరం పట్టణంలోని గీతానగర్‌కు చెందిన అంజి, వెంకటరమణ, కృష్ణ బైకులో గార్లదిన్నె మండలం ముంటిమడుగు నుంచి ధర్మవరం వెళ్తున్నారు. బడన్నపల్లి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.
- ఈనెల 5న గొల్లపల్లి క్రాస్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని ఆదిమూర్తి, రాజారెడ్డి, కార్తీక్‌రెడ్డి, మూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 6న గొల్లపల్లి క్రాస్ ఎంఐజీ లేఅవుట్ ఎదురుగా రెండు బైక్‌లు ఢీకొని నరేష్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.
- గతేడాది సెప్టెంబరు 8న గొల్లపల్లి సమీపంలో కనగానపల్లి మండలం వేపకుంటకు చెందిన మల్లికార్జున తన ద్విచక్రవాహనంలో వెల్దుర్తి నుంచి అనంతపురం వెళ్తూ గొల్లపల్లి సమీపాన అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి, అక్కడికక్కడే మృతిచెందాడు.
- బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి యువకుడు పోతులరాజు తన ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుచేయలేక అక్కడే ఉన్న చిన్నారి షర్మిలను ఢీకొట్టగా ఇద్దరూ ప్రాణాలు వదిలారు.
- ధర్మవరం పట్టణంలోని కోట బసవన్నవీధికి చెందిన మిడతల అశోక్ అనంతపురం నుంచి తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా చిగిచెర్ల క్రాస్ సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుతప్పి ఎగిసిపడ్డాడు. తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తిస్తాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. స్పీడ్‌బ్రేకర్ల వద్ద తెలుపు పెయింటింగ్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తాం. అతివేగమే ప్రమాదాలకు కారణమవుతోంది. వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ద్విచక్రవాహనదారులు వేగాన్ని తగ్గించి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

\- శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ ఎస్ఐ

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి ఆటశాల కాన్ఫరెన్స్ ప్రారంభం



ఆటశాల వర్క్‌షాపులో కోచ్‌లు, క్రీడానిపుణులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటశాల కాన్ఫరెన్స్ శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ప్రారంభించారు. మొదటి రోజు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, అథ్లెటిక్ క్రీడాకారిణి కీర్తన, ఏఎస్‌ఏ కోచ్ కుమార్‌లు వర్క్‌షాపును ప్రారంభించారు. ఒడిశా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ పీఆర్‌ఓ సుహేల్‌తండన్ లైఫ్ స్కిల్స్, క్రీడావిద్యా సంస్కారంపై వివరించారు. బెంగళూరుకు చెందిన సింప్లీస్పోర్ట్ ఫౌండేషన్ అదితి ముటాత్కర్ మహిళా సాధికారత, బాలికల క్రీడాభాగస్వామ్యం వివరించారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, సుహేల్‌తండన్‌లు క్రీడల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. కాన్ఫరెన్స్ శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు న్యాయమైన పరిహారం అందాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చే రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఏలర్సీ సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామం వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అక్కడ స్టేషన్ నిర్మాణానికి 17.97ఎకరాల విస్తీర్ణంలో భూములను సేకరిస్తామన్నారు. ఆభూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో ప్రతిపాదిత మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం సొమ్ము ఇచ్చామన్నారు. ట్రాన్స్‌కో విభాగానికి 21టవర్లు, 132, 220,400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లను మార్చడం కోసం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మార్కెట్ విలువకు అనుగుణంగా మూడు విధాలుగా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. పరిహారం పంపిణీ పూర్తికావడంతో పనులు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ జేడీ నరసింహారావు, ఎన్‌హెచ్ ఏఐపీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చిరుత..!



కొండలో సంచరిస్తున్న చిరుత

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వ మున్సిపాలిటీ పరిధి ముదిగల్లు గ్రామంలో శుక్రవారం చిరుత కలకలం రేపింది. ఇళ్ల పక్కనే ఉన్న కొండల్లో చిరుత కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. తరచూ చిరుత సంచరిస్తుండటంతో పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడిపోతున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు.

24న అనంతకు విద్యాశాఖ కమిషనర్ రాక

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 24న జిల్లాకు రానున్నారు. తొలిసారి ఆయన అనంతపురం జిల్లాకు రానున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులతోపాటు, ఐసీడీఎస్ అధికారులతో కమిషనర్ వేర్వేరుగా సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా 117 జీవో ఉప సంహరణ, స్కూల్ కాంప్లెక్స్ మోడిఫికేషన్ తదితర అంశాలపై డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం నిర్వహించే వేదికను ఎంపిక చేసే పనిలో విద్యాశాఖాధికారులున్నారు. అనంతపురంలోని జేఎన్‌టీయూ లేదా ఇతర ప్రాంతాల్లో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

వరించిన సంతోషం

24 గంటల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సొమ్ము జమ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

గతేడాది మూడు నెలల వరకు ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వ తీరుపట్ల అన్నదాతల హర్షం

బొమ్మనహాళ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వరి ధ్యానం విక్రయించిన 24గంటల్లోనే ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ములు జమ చేస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం డబ్బులు కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూశారు. ధాన్యం విక్రయించిన 90 రోజులకు కూడా నగదు అందకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణ చేశారు. ప్రభుత్వ ఆలస్యంగా ధాన్యం సొమ్ము జమ చేస్తుండటంతో కొందరు రైతులు దళారులకే తమ పంటను విక్రయించారు. అయితే ఈ ఏడాది ఆ బాధలన్నీ తొలగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల నుంచి సొమ్ము జమ చేసే వరకూ ప్రతిది పక్కాగా అమలు చేస్తుండంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు శ్రీధరఘట్ట సొసైటీ పరిధిలో 315 మంది రైతుల నుంచి 35,120 క్వింటాళ్ల వరిధాన్యం సేకరించారు. ఉద్దేహాళ్ సొసైటీ పరిధిలో 208 మంది రైతుల నుంచి 25,587 క్వింటాళ్లు సేకరించారు. ఈ ధాన్యం విలువ రూ.14.78 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.14 కోట్లు జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీన్ని బట్టి కొనుగోలు ప్రక్రియ అంతా ఎంత వేగంగా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

24 గంటల్లోనే..



169 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించా. 24 గంటల్లో నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ అయింది. గత వైసీపీ పాలనలో ధాన్యం విక్రయించి నెలల తరబడి డబ్బు కోసం ఎదురు చూశా. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే 24 గంటల్లో నగదు ఖాతాలో జమ చేశారు. చాలా సంతోషంగా ఉంది. నా ఒక్కడికే కాదు ప్రభుత్వానికి విక్రయించిన ప్రతి రైతు సంతోషంగా ఉన్నారు.

- లక్ష్మన్న రైతు, రంగాపురంక్యాంప్

సమస్యగా మారిన తేమ

ఈ ఏడాది రైతులకు ధాన్యంలో తేమ సమస్యగా మారింది. ధాన్యంలో తేమ 25 శాతం వరకు ఉంటోంది. రెండు తుఫాన్ల ప్రభావంతో ఎండలు తక్కువగా ఉన్నాయి. అయితే తేమ శాతాన్ని వ్యవసాయ శాఖ సిబ్బందే క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. 17 శాతం కంటే తక్కువ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేశాక 24 నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బు జమవుతోంది. ఈ పరిణామం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది.

నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా



వరి పంట కోత కోసిన నాలుగు రోజులకే ధాన్యం విక్రయించా. ముందుగా రైతుసేవాకేంద్రంలో నమోదు చేసుకొన్నా. వెంటనే ఖాళీ సంచులు ఇచ్చారు. లారీ ఏర్పాటు చేశారు. వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి లోడు చేసి పంపించిన 24 గంటల్లో నగదు జమ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. 690 క్వింటాళ్లు విక్రయించా. రూ.15.45 లక్షలు నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. గతంలో ఎప్పుడు ఇంత త్వరగా ధాన్యం డబ్బులు రాలేదు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండ



కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను జమ చేస్తోంది. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత డబ్బులు కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ కూటమి పార్టీల పాలనలో పరిస్థితి మారింది. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. రైతుకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. గత వైసీపీ పాలనలో ధాన్యం అమ్ముకోవడాని రైతులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. వీటిని సరిదిద్ది కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నడిచేలా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

- కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే

పాలిటెక్నిక్ విద్యార్థులకు లోకేశ్ ప్రశంసలు



నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్

రాయదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024-25 పోటీలో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసలు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు తెలిపారు. కళాశాల నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులు లోకేశ్‌ను ఆకట్టుకున్నాయని వివరించారు. ప్రభుత్వం తరఫున ఈ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సోలార్‌తో నడిచే స్మార్ట్ వీల్‌ఛైర్‌ను కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నరేష్, యోగేష్, మధుసూధన్ తయారని చెప్పారు. కుర్చీగానే కాకుండా బెడ్, రిక్లైనర్ లాగా కూడా ఉపయోగించుకోవచ్చు. పోర్టబుల్ టాయిలెట్‌ను కూడా అమర్చారు. కూలీలు తక్కువ శ్రమతో బరువులు మోసే పరికరాన్ని మెకానికల్ విద్యార్థులు ప్రసాద్, బాలాజీ, యశ్వంత్ తయారు చేశారు. ఈ ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్యకారణమైన కళాశాల లెక్చరర్స్, ప్రాజెక్టు మెంటర్స్ ఎల్ హర్ష, అలీషా, కలాం, షేక్షబానాను ఆయన అభినందించారు. అత్యంత ప్రతిభ కనబరిచి విద్యార్థులు గెలుచుకున్న రూ. 10 వేలు బహుమతిని వారి చేతికి అందజేశారు.

కిడ్నాప్, చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

తాడిపత్రి, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామ సమీపంలో గన్నెవారిపల్లికాలనీకి చెందిన మహిళను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహిళను కొట్టి మెడలో ఉన్న చైను, కమ్మలు దొంగతనం చేసిన కేసులో వీరాంజనేయులు, రాధమ్మ, భూలక్ష్మి, దశరథను అరెస్ట్ చేసి వారి నుంచి 3.2తులాల బంగారు గొలుసు, కమ్మలు, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేణుకకు వీరాంజనేయులుకు గతంలో ఆర్థిక లావాదేవీలు ఉండడంతో మనస్పర్థలు ఉండేవన్నారు. అప్పటి నుంచి వీరాంజనేయులు రేణుకపై కక్ష పెంచుకున్నారన్నారు. అందులో భాగంగా రెండురోజుల క్రితం వీరాంజనేయులు, అతడి భార్య రాధమ్మ, అత్త భూలక్ష్మి, డ్రైవర్ దశరథ సాయంతో చుక్కలూరు వద్ద పనులకు వెళుతున్న రేణుకను స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారన్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆమెను చితకబాది మెడలో ఉన్న బంగారు గొలుసు, కమ్మలు తీసుకొని ఆమెను అక్కడే వదిలేశారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. అందిన సమాచారం మేరకు చుక్కలూరు క్రాస్ వద్ద స్కార్పియోలో వెళుతున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై తిరుగుబాటు

కళ్యాణదుర్గం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల పరిధిలోని రాళ్లపల్లిలో ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్థులు తిరగబడ్డారు. శుక్రవారం ఆ గ్రామ సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో గ్రామ మహిళలు, గ్రామస్థులు ఎదురు తిరిగారు. వంకలో నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను నిలిపివేసి రోడ్డుకు అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు లేక ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ సమీపంలోని ఇసుకనంతా తోడేస్తే ఎక్కడికి వెళ్లాలంటూ గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. ఇక్కడి నుంచి ఒక్క ట్రాక్టర్ ఇసుకను కూడా రవాణా చేసేది లేదంటూ అక్కడికి వచ్చిన వీఆర్వో సూర్యనారాయణతో వాదించారు. ఉచిత ఇసుకయితే రోజుకు రెండు, మూడు ట్రాక్టర్లు రవాణా చేసుకోవాలే గానీ.. ఇలా ఈ వంక వద్ద ట్రాక్టర్లన్నీ క్యూ కడుతున్నాయన్నారు. దీంతో భూగర్భజలాలన్నీ ఎండిపోయే ప్రమాదం వుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, వీఆర్వో సూర్యనారాయణ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.



వీఆర్వో సూర్యనారాయణతో వాదిస్తున్న గ్రామస్థులు

ట్రాక్టర్లను ఆపివేసిన గ్రామస్థులు



దారికి అడ్డంగా నిలబడిన గ్రామస్థులు

ఏటీఎం కేంద్రంలో మోసం

కార్డు మార్చి.. నగదు డ్రా..



గుత్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌కు వచ్చేవారిపై నిఘా ఉంచి డబ్బు డ్రాచేసి ఇస్తానని ఏమార్చి ఏటీఎం కార్డు మార్చేసి, అందులోని నగదు డ్రా చేసుకుని ఉడాయించాడు ఓ దుండగుడు. పట్టణంలో శుక్రవారం ఈ మోసం వెలుగుచూసింది. పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి.. భర్తతో ఏటీఎం కార్డు పంపించి, రూ.3000 డ్రా చేయమని చెప్పింది. అతనికి ఏటీఎం సెంటర్ వద్ద ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అడిగాడు. ఇదే చాన్స్ అనుకున్నాడు ఆ దుండగుడు. వృద్ధుడిని మభ్యపెట్టి ఏటీఎం కార్డు మార్చేశాడు. సర్వర్ బిజీ ఉంది కాసేపు ఆగి మరి డ్రా చేసుకో అంటూ అతని వద్దనున్న కార్డు మార్చి వేరొకటి ఇచ్చాడు. అక్కడి నుంచి వెళ్లిపోయి మరో ఏటీఎంలో 9,00,600 డ్రా చేశాడు. నగదు డ్రా చేసినట్లు వృద్ధుడి ఫోన్‌కు మెసేజ్ రావడంతో అయోమయానికి గురయ్యాడు. విషయాన్ని వెంటనే పోలీసులకు అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

గొంతు కోసుకుని వ్యక్తి మృతి

రాయదుర్గంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా రాజన్న(60) అనే వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజన్న కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురై గురువారం రాత్రి గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ముక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కొడుకులు ఉన్నారని పేర్కొన్నారు.

పది ఇళ్లలో చోరీ

ఒక ఇంట్లో మాత్రమే వెండి, నగదు అపహరణ

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇళ్లు, పలు షాపుల్లో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న శివనాగన్న ఇంట్లో రూ.50వేల నగదు, 30వేలు విలువగల వెండి, అరతులం బంగారం చోరీకి గురైందని పోలీసులు తెలిపారు. శివనాగన్న కుటుంబ సభ్యులతో కలిసి గుత్తికి వెళ్లాడు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న వెంకటనారాయణ హోటల్, మహేశ్వరరెడ్డి పైపుల దుకాణం, ఫొటోస్టుడియో, ఆర్‌ఎంపీ నివాసం, డెంటల్ ఆసుపత్రితోపాటు పలు ఇళ్లల్లో చోరీకి తెగబడ్డారు. ఒక్క ఇంటిలో తప్ప మరెక్కడా నగదు, ఆభరణాలు చోరీకి గురికాలేదు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడుకు చెందిన నవీన్‌కుమార్ (21) అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నందలపాడుకు చెందిన ఆదినారాయణ, నాగరత్నమ్మ దంపతులకు ఇద్దరు సంతానం కాగా నవీన్‌కుమార్ రెండవవాడు. నవీన్‌కుమార్ గ్రానైట్ బండలను పరిచే పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలం నుంచి చెడుఅలవాట్లకు బానిసై అప్పులు చేశాడు. ఒత్తిళ్లు ఎక్కువకావడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజల నుంచి భారీగా అర్జీల స్వీకరణ

రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికం



బత్తలపల్లి మండలం మాల్యవంతం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా భూములను చెరబట్టడమే కాకుండా రాజకీయ జోక్యంతో వేలాది ఎకరాలను వివాదంలో పడేసి ఎంతో మందిని బాధితులుగా మార్చారు. బాధితుల గోడు వినకపోగా.. తిరిగి వారిపైనే కేసులు బనాయించి భూ మాఫియాకు వైసీపీ నేతలు అండగా నిలిచారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గత ప్రభుత్వంలో భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా వాటిని వైసీపీ నేతలే హస్తగతం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ పరంపరలోనే కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో పెద్ద సంఖ్యలో బాధితులు అధికారులను ఆశ్రయించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఎక్కువగా భూ వివాదాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ప్రజాదర్బార్‌లలో సైతం ఎక్కువగా భూ బాధితులే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా సమస్యలకు చెక్ పెట్టడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రెవెన్యూ గ్రామాల ప్రామాణికంగా సదస్సులు నిర్వహించి భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డిసెంబరు 6 నుంచి వాటికి శ్రీకారం చుట్టగా జనవరి 8వ తేదీన ముగిశాయి. ఒక్కో మండలంలో రోజుకు ఒక గ్రామంలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామంలోని భూ బాధితుల సమస్యలతో మళ్లీ అధికారులను ఆశ్రయించకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఒక్కో గ్రామంలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకుని బాధితుల నుంచి అర్జీల స్వీకరించి, కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సదస్సులు తహసీల్దార్ నేతృత్వంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌ఓలు బృందంగా ఏర్పడి పాల్గొన్నారు. వీరితో పాటు దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సదస్సులతో అయినా భూ సమస్యలకు చెక్ పడాలని బాధితులు ఎదురుచూస్తున్నారు. నెలకుపైగా జరిగిన సదస్సుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులే అధికంగా ఉన్నాయి. సమస్యలపై ఆయా సదస్సుల్లో బాధితులు బారులు తీరారు. రికార్డుల్లో ఉండాల్సిన భూమి కంటే తక్కువ విస్తీర్ణం ఉందని పలువురు నివేదించారు. ఇలాంటి ఫిర్యాదుల విషయంలో ఉన్నతస్థాయిలో సర్వే నిర్వహించి తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగా ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేయడంతో పాటు సిబ్బంది విచారణ చేపడుతారని తరువాతే వీటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుందని యంత్రాంగం చెబుతోంది. సదస్సులో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కూడా రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు అందాయి.

462 గ్రామాల్లో సదస్సులు

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 462 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 49 రకాల సమస్యలపై 4,522 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ అధికారులు 2023 ఫిర్యాదులను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 2,499 అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ రికార్డుల్లో తప్పులపై 1446, పొలాల సరిహద్దులు 364, మ్యూటేషన్ 263, సాగు, ఇళ్లపట్టాలు 4,123, విస్తీర్ణంలో తేడాలు 226, ఇతర సమస్యలపై 1810 వచ్చినట్లు జిల్లా రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలపై విజిలెన్స్ విచారణ

ధర్మవరంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లిలో గత వైసీపీ హయాంలో జగనన్న కాలనీల కోసం భూములిచ్చిన రైతులతో శుక్రవారం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ సద్గురుడు విచారణ చేశారు. ఎంతమంది రైతులు భూములు ఇచ్చారు, ఎన్ని ఎకరాలు సేకరించారు అన్న వివరాలను తెలుసుకున్నారు. 23 మంది రైతులు, 73.34 ఎకరాలు భూములు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అనంతరం విజిలెన్స్ డీఎస్పీ, సీఐలు రైతులతో మాట్లాడుతూ.. ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారా, అప్పట్లో ఎవరైనా బలవంతంగా తీసుకున్నారా, పరిహారం పూర్తిగా ఇచ్చారా, ఇప్పటి వరకు ఎవరికైనా పరిహారం ఇవ్వలేదా అని ఆరాతీశారు. ఏమైనా ఇబ్బందులు పెట్టి ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు.



రైతులతో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం

పిల్లల లెక్క తప్పితే.. హెచ్‌ఎంలదే బాధ్యత

20 నుంచి జిల్లాల పర్యటనకు వస్తా

వీసీలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు



వీసీలో మాట్లాడుతున్న కమిషనర్, హాజరైన డీఈఓ ఇతర అధికారులు

అనంతపురం విద్య, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యపై తప్పుడు సమాచారం ఇచ్చినా... లెక్కలు తప్పినా...చర్యలు తప్పవని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు హెచ్చరించారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జిల్లాల పర్యటనకు వస్తానని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా117 జీవో రద్దు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు, బోధనా సిబ్బంది పునర్విభజన తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 20వ తేదీ తర్వాత తాను జిల్లాల పర్యటనకు వస్తానన్నారు. మీరు చెబుతున్న డేటాకు, క్షేత్రస్థాయిలో ఉన్న దానికి తేడా ఉండకూడదన్నారు. విద్యాశాఖ పిల్లల కోసం ఎంతగానో ఖర్చు చేస్తోందన్నారు. హెచ్‌ఎంలు ఇచ్చే డేటా మేరకే పిల్లల కోసం కిట్లు, బుక్స్, ఇతర మెటీరియల్ కొంటున్నారన్నారు. డబ్బులు వృథాకాకూడదని అన్నారు. ప్రధానోపాధ్యాయులు తప్పుడు డేటా ఇస్తే...చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్చిన గైడ్‌లైన్స్ చదవకుండా... తాను జిల్లా పర్యటనలకు వచ్చినప్పుడు డీఈఓలు, డీవైఈఓలు, ఎంఈఓలు సైతం తనకు సంబంధం లేదని అనడానికి వీల్లేదన్నారు. సమావేశంలో డీవైఈఓలు శ్రీనివాసులు, శ్రీదేవి, ఎంఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

సైబర్ దొంగ ఆటకట్టు

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.30 లక్షల డిమాండ్

ధైర్యంగా ఎదుర్కొన్న రిటైర్డ్ ఉద్యోగి



రిటైర్డ్ ఉద్యోగి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సీఐలు

అనంతపురం క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ సైబర్ నేరగాడు ఓ రిటైర్డ్ ఉద్యోగిని డబ్బు డిమాండ్ చేశాడు. ఆ నేరగాన్ని రిటైర్డ్ ఉద్యోగి ధైర్యంగా ఎదుర్కొన్నాడు. పోలీసుల సాయంతో రూ.30లక్షలు రక్షించుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. 'నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు.. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు డబ్బు ఇవ్వాలి' అంటూ సైబర్ నేరగాడు అనంతపురానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయియణరెడ్డిని వేధించసాగాడు. రెండ్రోజుల నుంచి ఫోన్‌లో ఇదేవిధంగా సతాయించాడు. ఇదంతా డబ్బు కాజేయడానికే సైబర్ నేరగాడు తనను బెదిరిస్తున్నట్లు నారాయియణరెడ్డి భావించాడు. డిజిటల్ అరెస్టుపై అవగాహన కలిగి ఉండటంతో శుక్రవారం సైబర్ పోలీస్ విభాగాన్ని సంప్రదించాడు. సీఐ జాకీర్ నారాయియణరెడ్డి వాయిస్ పూర్తిగా విన్నారు. ఆలస్యం చేయకుండా నారాయణరెడ్డిని స్థానిక టూటౌన్ సీఐ శ్రీకాంత్ వద్దకు తీసుకెళ్లారు. అవతలి నుంచి రూ.30 లక్షల కోసం తరచూ ఫోన్ చేస్తున్న సైబర్ నేరగాడితో సీఐ శ్రీకాంత్ మాట్లాడారు. నీవు సైబర్ నేరగాడివని, ప్రజలను ఇలా సైబర్ ఫ్రాడ్స్‌కు గురిచేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని సీఐ హెచ్చరించారు. దీంతో అవతలి సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం, డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బు డిమాండ్ చేసే వారిని పోలీసులు సంప్రదించి ధైర్యంగా ఎదుర్కొంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా సేఫ్‌గా ఉండొచ్చని సీఐలు సూచించారు. రిటైర్డ్ ఉద్యోగి నారాయణరెడ్డిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. అనంతరం నారాయణరెడ్డిని టూటౌన్ సీఐ శ్రీకాంత్, సైబర్ సెల్ సీఐ షేక్ జాకీర్ అభినందిస్తూ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

బుక్కరాయసముద్రం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పసులూరు గ్రామ శివారులోని క్వారీలో ఉన్న నీటి గుంతలో ఈతకు వెళ్లి దుబ్బప్పగారి ప్రసాద్(11) అనే బాలుడు శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పసులూరు గ్రామానికి చెందిన దుబ్బప్పగారి ఓబులేసు, అంజినమ్మ దంపతుల కుమారుడు ప్రసాద్ అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో మధ్యాహ్నం ప్రసాద్ తోటి స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న కమ్మగుడ్డము అనే కొండ క్వారీ వద్దకు ఈతకు వెళ్లారు. క్వారీలో ఉన్న నీటిగుంతలో ఈత కోసం దిగారు. ప్రసాద్‌కు ఈత రాదు. క్వారీ గుంత లోతు ఎక్కువ ఉడడంతో నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. అతడి తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే పొలాల్లో ఉన్న రైతులు వచ్చి ప్రసాద్‌ను నీటి గుంతలో నుంచి బయటికి తీశారు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సరఫరా టెండర్‌లో డ్రామా!

రెండునెలలకు పిలుపు

డిపాజిట్ మొత్తం పెంపు

ఎవరూ రాకూడదనేనా?

శాఖ ఆధ్వర్యంలో నిర్వహణకు అధికారుల పన్నాగం



హెచ్‌పీ గ్యాస్ గోడౌన్

అనంతపురం టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ పంపిణీకి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రాకుండా ఆ శాఖ అధికారులు పెద్ద డ్రామాకు తెరలేపారు. తమ ఆధ్వర్యంలోనే సరఫరా జరిగితే వచ్చే కమీషన్ బొక్కేయవచ్చన్నది వారి పన్నాగం. టెండర్ గడువు ముగిసి ఏడాది కావస్తున్నా పిలవకుండా వారే సరఫరా చేయిస్తున్నారు. ఇక రెండు నెలలకు గడువు ముగియనుండడంతో ఉన్నఫలంగా టెండర్లు పిలవడం, గతంకన్నా డిపాజిట్లకు అధిక ధరలు నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ టెండర్‌కు ఎవరూ ముందుకు రాకూడదనే అధికారులు కుట్ర చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఇదీ విషయం..

పౌరసరఫరాల శాఖ కార్యాలయం సమీపంలోనే హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఉంది. దీని పరిధిలో 10వేల వరకు కనెక్షన్లు ఉంటాయి. గ్యాస్ గోడౌన్‌ను ఆ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. సాధారణంగా గ్యాస్ సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్ దక్కించుకున్న వారికి సరఫరా బాధ్యతలు అప్పగించడం చేస్తుంటారు. గ్యాస్ సరఫరా చేసినందుకు సిలిండర్‌కు ప్రస్తుతం రూ.8 కమీషన్ ఇస్తున్నారు. 2024 మార్చిలోనే గ్యాస్ సరఫరా టెండర్ గడువు ముగిసింది. తర్వాత కొత్త టెండర్ పిలవలేదు. వివిధ కారణాలు చూపుతూ అప్పటి నుంచి ఆ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. సరఫరా చేసిన బాయ్స్‌కు డబ్బు ఇస్తూ మిగిలిన సొమ్ము స్వాహా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోనే టెండర్ జరగకుండా ఇంతకాలం కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆఖర్లో హడావుడి..

మూడు రోజుల క్రితం హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు టెండర్లు పిలిచారు. ఇందులో మతలబు ఉన్నట్లు ఆ శాఖ అధికారులపై వస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. పదేళ్ల క్రితం టెండర్ దరఖాస్తు ధర రూ.5వేలు, ఈఎండీ రూ.2లక్షల డీడీ, మరో మూడు లక్షలు సెక్యూరిటీ డిపాజిల్ ఉండేదని సమాచారం. అపుడు సిలిండర్ సరఫరాకు రూ.5 కమీషన్ ఇచ్చేవారు. ఆరేళ్ల క్రితం టెండర్ దరఖాస్తు ధర రూ.10 వేలు, ఈఎండీ రూ.2 లక్షలు, సెక్యూరిటీ డిపాజిల్ రూ.5లక్షలు నిర్ణయించారు. అప్పటి నుంచి సిలిండర్ సరఫరాకు రూ.8 చొప్పున ఇస్తున్నారు. తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో టెండర్ దరఖాస్తు ధర రూ.25 వేలకు పెంచారు. ఈఎండీ రూ.2.50 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ7.50 లక్షలు చొప్పున పెంచేశారు. సిలిండర్ సరఫరాకు మాత్రం రూ.8 నిర్ణయించారు. ఈ టెండర్ మార్చి వరకే.. అంటే రెండున్నర నెలలు ఉంటుంది. ఇంత ధర పెడితే ఎవరూ టెండర్‌కు ముందుకురారనీ, తామే ఎంచక్కా గ్యాస్ సరఫరాను కొనసాగించి.. బాయ్స్‌కు అంతోఇంతో ఇచ్చేసి జేబులు నింపేసుకుందామనే ఇలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 17వ తేదీ వరకు టెండర్లకు గడువు ఉంది. ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాలేదు.

మార్చి తర్వాత మళ్లీ టెండర్



గత ఏడాది మార్చికే గ్యాస్ సరఫరా టెండర్ గడువు ముగిసింది. అప్పట్లో టెండర్ పిలవడానికి ఎన్నికల ప్రక్రియ తదితర కారణాలు అడ్డువచ్చాయి. దీంతో మా శాఖ ద్వారానే బాయ్స్‌ను నియమించుకుని సరఫరా చేస్తున్నాం. తాజాగా టెండర్లు పిలిచాం. ఈ టెండర్ కూడా ఈ ఏడాది మార్చి వరకే ఉంటుంది. టెండర్ ధరలు ఉన్నతాధికారుల నిర్ణయమే. మార్చి తర్వాత మళ్లీ టెండర్లు పిలుస్తాం.

- రమేష్‌రెడ్డి, డీఎం, పౌరసరఫరాల శాఖ

పచ్చని చెట్లపై కత్తి

- టీడీపీ నాయకుడి తోటలో 1052 అరటి చెట్ల నరికివేత
- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
- పరిశీలించిన టీడీపీ నాయకులు



నరికేసిన అరటిచెట్లు



పరిశీలిస్తున్న డీఎస్పీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

పుట్లూరు/యల్లనూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన అరటి తోటపై దుండగలు తమ ప్రతాపం చూపారు. నెల రోజుల్లో పంట కోయాల్సిన గెలలతో కూడిన తోటను ఇష్టానుసారం నరికివేయడంతో నేలపాలైంది. పుట్లూరు మండలం కొండుగారికుంట గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడుకు చెందిన అరటి చెట్లను శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. యల్లనూరు మండలం బొప్పేపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 607లో 3.50 ఎకరాల్లో సుదర్శన్‌నాయుడు 4,500 అరటిచెట్లను సాగుచేస్తున్నారు. ఇందులో 1052 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఉదయం 7 గంటలకు తోటకు వెళ్లిన సుదర్శన్‌నాయుడు చెట్లను నరికివేయడం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నెలరోజుల తర్వాత అరటి గెలలు కోతకు వచ్చేవి. ఈ సమయంలో నరికివేయడంతో సుమారు రూ.6లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ధర కూడా ఆశించినస్థాయిలో ఉండడంతో నెలరోజుల తర్వాత చేతికి వచ్చే పంటను ముందుగానే ఓ వ్యాపారి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు, ఏఎస్ఐలు పరిశీలించారు. యల్లనూరు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

అరటిచెట్లను నరికివేశారన్న విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకొని చుట్టుపక్కల తోటలను పరిశీలించారు. నిందితుల గుర్తింపు కోసం జిల్లా కేంద్రం నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేయించారు. డాగ్‌స్క్వాడ్ తోటలో నుంచి గ్రామంలోని బస్టాప్ వరకు వెళ్లి అక్కడే ఆగిపోయింది. దీంతో నిందితులు చెట్లు నరికివేసి గ్రామంలోని బస్టాప్ వద్దకు వచ్చి వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పరిశీలించిన టీడీపీ నాయకులు

సుదర్శన్‌నాయుడుకు చెందిన అరటిచెట్లను నరికివేశారన్న సమాచారం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, నాయకులు అశోక్, బాలరంగయ్య తోటకు వద్దకు చేరుకొని నరికివేసిన చెట్లను పరిశీలించారు. సుదర్శన్‌నాయుడును పరామర్శించారు. అరటిచెట్లు నరకడం పిరికిపంద చర్య అని వెంకటశివుడు యాదవ్, నరసానాయుడు ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పుట్లూరు, యల్లనూరు తహసీల్దార్లు శేషారెడ్డి, రాజా, వీఆర్వోలు తోటను పరిశీలించారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు కులశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, గోవర్దన్‌రాజు, రవిచంద్రనాయుడు, రామాంజనేయులు, భాస్కర్‌నాయుడు, చెన్నారెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



సొసైటీ ఉద్యోగుల ధర్నాలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. ఆంజనేయులు, జె. హరికృష్ణ మాట్లాడుతూ 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 36ను అమలు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో సొసైటీ ఉద్యోగులు హెచ్‌ఆర్ పాలసీ వర్తింపచేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. వేతనసవరణ జరిగేలోపు మధ్యంతర భృతి ఇవ్వాలని, జిల్లా స్థాయిలో సహకార నిధి ఏర్పాటు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు నాగేంద్ర, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బీహెచ్ రాయుడు, ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు భరత్, సోమశేఖర్, సునీత సొసైటీ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, రామాంజనేయులు, దామోదర్, నరేంద్రరెడ్డి, బొజ్జప్ప పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం

నీటిని కాపాడండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నీటిని కాపాడి రాయలసీమ రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీశైలం జలాశయంలోని నీటిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో పూర్తిగా తోడేస్తున్నాయని విమర్శించారు. ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి 1,622 టీఎంసీల వరద నీరు హంద్రీనీవా కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకూ వచ్చే పరిస్థితి లేకపోవ.డంపై ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం డ్యాంలో వచ్చిన నీటిని ఇప్పటికే తెలంగాణ 358.84 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 199.38 టీఎంసీలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో కిందకు వదిలేశాయన్నారు. ప్రస్తుతం డ్యాంలో 105 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఈ కొద్దిపాటి నీటితో హంద్రీనీవా కాలువ కింద సాగైన పంటలు పూర్తయ్యే అవకాశం లేదన్నారు. గతేడాది వర్షాభావం వల్ల పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు లేక అనంతపురం, కర్నూలు జిల్లాల రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారని గుర్తుచేశారు. పదివేల క్యూసెక్కుల సైజులో కాలువ వెడల్పు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం శ్రీశైలంలో ఉన్న నీటిని తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుంటే అడ్డుకోవాల్సిందిపోయి పోటీపడి కిందకు వదిలి జలాశయాన్ని ఖాళీ చేయిస్తోందని విమర్శించారు. వెడల్పు, ప్రస్తుత పంటల రక్షణ కోసం హంద్రీనీవా సాగుదార్లతో ఈనెల 19న కర్నూలులో సదస్సు, 27న అనంతపురం, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు శుభవార్త

మూడుచక్రాల వాహనదారులకు సబ్సిడీతో పెట్రోల్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు శుభవార్త చెప్పింది. శారీరక దివ్యాంగులు మూడు చక్రాల వాహనాలకు వాడే పెట్రోలుకు సంబంధించి సబ్సిడీ ఇచ్చేందుకు నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ బి. వినోద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. సొంత వ్యాపారాలు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు మూడు చక్రాల వాహనాలు కలిగి ఉన్న శారీరక దివ్యాంగులకు పెట్రోలుకు 50 శాతం సబ్సిడీ చెల్లించనుంది. నెలలో వాడిన పెట్రోలుకు 50 శాతం సబ్సిడీ రూపంలో నగదును అందజేయనుంది. పెట్రోల్ సబ్సిడీ కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, పెట్రోలు బిల్లులు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదట పేజీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు 3, మూడు చక్రాల వాహనం ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు పత్రాలతో పాటు వ్యాపారం, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తులు జిల్లా కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08554-232380 నంబరులో సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామంలో కడుపు నొప్పి భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి(42) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. అయితే గత కొంతకాలంగా గ్రామంలోనే వర్క్‌ఫ్రం హోం కింద విధులు నిర్వహిస్తుండేవాడు. భార్య హేమలత కూడా చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. శ్రీకాంత్‌రెడ్డి కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటిపైకి వెళ్లి పురుగులమందు సేవించాడు. ఎంత సేపటికి కుమారుడు కిందకు రాకపోవడంతో తండ్రి ఇంటిపైకి వెళ్లి చూశాడు, అపస్మారకస్థితి పడి ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని వెంటనే కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంతరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

695 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 684 ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 438 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.11

అనంతపురంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.24వేలు

అనంతపురంరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24,320, కనిష్ఠంగా రూ.9,500, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 18టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు కీలక నిందితులు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టుచీరల పాలిష్ వ్యాపారి నారాయణరెడ్డిపై హత్యాయత్నం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిందితుల అరెస్టు వివరాలను ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హిందూపురం పట్టణం దండు రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్న నారాయణరెడ్డి నాలుగేళ్లపాటు ముద్దిరెడ్డిపల్లిలోని అరవిందనగర్‌కు చెందిన బాలకృష్ణ అలియాస్ బాలు వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ఇతడు చీరలను పాలిష్‌చేసి ధర్మవరం, హిందూపురానికి సరఫరా చేసేవాడు. నాలుగు నెలల క్రితం ఆర్థికపరమైన అంశాలతో నారాయణరెడ్డి, బాలకృష్ణ విడిపోయారు. నారాయణరెడ్డి సొంతంగా మినీ వ్యాన్ తెచ్చుకుని ధర్మవరం, ముద్దిరెడ్డిపల్లి నుంచి పట్టుచీరలు తీసుకొచ్చి కర్ణాటకలోని యలహంకలో పాలిష్ చేయించి అప్పగించేవాడు. నారాయణరెడ్డి.. బాలకృష్ణకు చెందిన చీరలు బయటకు తరలించే సమయంలో అధికారులకు చెప్పి ఇబ్బందులు పెట్టేవాడు. వాణిజ్య పన్నులశాఖ, జీఎస్టీ అధికారులకు సమాచారం ఇచ్చి జరిమానా కూడా వేయించారు. దీంతో నారాయణరెడ్డిని ఎలాగైనా అంతమొందించాలని బాలకృష్ణ నిశ్చయించుకున్నాడు. వీరిద్దరి వద్ద సన్నిహితంగా ఉండే శాంతినగర్‌కు చెందిన ఫక్రుద్దీన్ అలియాస్ చోటు అనే వ్యక్తి ద్వారా కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరుకు చెందిన ముబారక్, ఫారూక్ అలియాస్ చిరి కలిసి నారాయణరెడ్డిని హత్య చేయడానికి రూ.5లక్షలు సుపారీ మాట్లాడుకున్నారు. అందులో రూ.4 లక్షలు అడ్వాన్సుగా చెల్లించాడు. గతంలో రెండుమార్లు గౌరీబిదనూరు నారాయణరెడ్డి ఇంటివద్ద ప్రయత్నాలు చేసినా.. అవి విఫలమయ్యాయి. ఈ తరుణంలో ఈనెల 7న నారాయణరెడ్డి డ్రైవర్ తౌసిఫ్ ఇజితెమా కారణంగా విధులకు రాలేదు. దీంతో నారాయణరెడ్డే సొంతంగా వాహనం నడుపుకుని బెంగళూరుకు చీరలు తీసుకెళ్లి పాలిష్ చేయించాడు. అదేరోజు మద్యం సేవిద్దామని ఫక్రుద్దీన్ అలియాస్ చోటుకు చెప్పాడు. ఇదే అదునుగా భావించి కర్ణాటకలోని గౌరీబిదునూరుకు చెందిన ముబారక్, మహ్మద్ ఫారూక్, టిప్టూర్‌కు చెందిన సైపుల్లా, ఉమర్ కలిసి హిందూపురం మండలంలోని పూలకుంట చెరువుకట్ట వద్దగల లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపానికి చేరేసరికి అర్ధరాత్రి దాటింది. చోటు, మరో ఐదుగురు నారాయణరెడ్డిని తీసుకెళ్లి మద్యం తాగారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి గొంతును కత్తితో కోశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయాడని నిందితులు పరారయ్యారు. బాలకృష్ణ అలియాస్ బాలు ఘటన జరిగిన మరుసటి రోజు ఫోన్‌పే ద్వారా గౌరీబిదనూరుకు చెందినవారికి డబ్బు పంపించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, ఆంజనేయులు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. బాలకృష్ణ అలియాస్ బాలు, చోటు, ముబారక్, మహమ్మద్ ఫారూక్ శుక్రవారం తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉండగా నలుగురిని అదుపులోకి తీసుకుని, విచారణ చేశారు. నేరం ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. వారి నుంచి రూ.63వేలు నగదు, బైక్, కత్తి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు సైపుల్లా, ఉమర్ పరారీలో ఉన్నారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు,జనవరి 10(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి క్లస్టర్ పరిధిలో ఒక మిని, ఏడు ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని క్లస్టర్ సీడీపీఓ గాయత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి మండలంలో బత్తలపల్లి మిని అంగన్‌వాడీ వర్కర్(ఓసీ), ఇరగరాజుపల్లి అంగన్‌వాడీ హెల్పర్(ఎస్సీ), పుట్టపర్తిలోని జానకిరామయ్య కాలనీ హెల్పర్(ఓసీ), కొత్తచెరువు బీసీ కాలనీ అంగన్‌వాడీ హెల్పర్(ఎస్సీ), నారాయణపురం అంగన్‌వాడీ హెల్పర్(ఓసీ), చిన్న బోయనపల్లి హెల్పర్(వీజేవలీ హ్యాండీక్యాప్డ్), బుక్కపట్నం క్రిష్ణాపురం -2, హెల్పర్ (బీసీ-ఏ), క్రిష్ణాపురం -1 హెల్పర్(ఓసీ) ఖాళీలు ఉన్నాయన్నారు. పది పాస్ అయి, స్థానికంగా ఉంటూ వివాహమైన మహిళలు అర్హులన్నారు.

● కదిరి అర్బన్ : కదిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీపీపీఓ రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంబులపూలకుంట మండలంలోని ధనియాన్‌చెరువు అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), తలుపుల మండలంలోని కోవ్వూరివాండ్లపల్లి (బీసీబీ), ఎన్పీకుంట తిమ్మమ్మమర్రిమాను (బీసీబీ), కదిరి అర్బన్ జామియా మసీదు(ఎస్సీ), కదిరి రూరల్‌లోని మాచిరెడ్డిపల్లి (ఓసీ), మల్లయ్యగారిపల్లి (ఓసీ) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 25 సాయంత్రం ఐదు గంటలోపు దరఖాస్తులు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



వడ్డెర కాలనీలో బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్డెర కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని మంత్రి సత్యకుమార్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లామని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ తెలిపారు. దీంతో సూచన మేరకు గురువారం రాత్రి పంచాయతీ నిధులతో ఆ కాలనలో బోరు వేయించినట్లు ఆయన శుక్రవారం చెప్పారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన తుమ్మల మనోహర్‌ను ఆ కాలనీ వాసులు సన్మానించారు.

నేడు వడ్డె ఓబన్న జయంతి

కదిరి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని శనివారం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వడ్డెర సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈజయంతికి ఎమ్మెల్యే కందికుంట హాజరవుతారన్నారు.

● గాండ్లపెంట: మండలకేంద్రంలో శనివారం నిర్వహించే వడ్డె ఓబన్న జయంతికి భారీగా తరలిరావాలని వడ్డెర సంఘం నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. వడ్డెర సంఘం ఐక్యత చాటి చెప్పుకోవడానికి సమావేశం నిర్వహిస్తామని, వడ్డెర సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తామని అన్నారు.

● నల్లమాడ : వడ్డె ఓబన్న జయంతిని అధికారంగా నిర్వహించేలా జీఓ విడుదల చేసిన కూటమి ప్రభుత్వనికి వడ్డెర సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పల్లపు జయచంద్ర మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర సమయోధుడి త్యాగాలను గుర్తించడం ఆనందంగా ఉందన్నారు.

సున్నంపల్లిలో కొండచిలువ

ఓబుళదేవరచెరువు : మండలంలోని సున్నంపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి కొండచిలువ వెళ్తుండటాన్ని ఆ గ్రామస్థులు గమనించారు. దాదాపు ఆరు అడుగుల పొడవు ఉందని తెలిపారు. రోడ్డు మీద పాకుతూ కొండ ప్రాంతం వైపు వెళ్లిందని చెప్పారు.

నేడు గోకులం షెడ్డు ప్రారంభోత్సవం

నల్లచెరువు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం మండలంలోని కుంట్లపల్లివాండ్లపల్లి రైతు సంజీవ్‌కు చెందిన గోకులం షెడ్‌ను ప్రారంభించనున్నట్లు కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఏఎస్ఐగా వెంకటరాముడు



ఓబుళదేవరచెరువు, జనవరి10 (ఆంధ్ర జ్యోతి): మండల ఏఎస్ఐగా వెంకటరాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఓడీసీ స్టేషన్‌లో జమేదార్‌గా పనిచే స్తున్న ఆయన.. ఏఎస్ఐగా ఉద్యోగోన్నతిపై ఇక్కడి వచ్చారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

కదిరి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్‌లో వెనుకబడి ఉన్నారని, హాజరు నమోదులో నిర్లక్ష్యం చేస్తే వేతనాల్లో కోత విధిస్తామని అన్నారు.

పరిహారం మంజూరుపై హర్షం

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చిత్రావతి జలాశయం నిర్మాణంతో ఇళ్లు కోల్పోయిన మర్రిమాకులపల్లి వాసులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తంచేశారు. పరిహారం మంజూరుకు కృషిచేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ధర్మవరంలోని బీజేపీ కార్యాలయ వద్ద మర్రిమాకులపల్లి ఎస్సీకాలనీ వాసులు మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

స్వయం ఉపాధిపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద

పుట్టపర్తి/రూరల్, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్వయం ఉపాధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కుటుంబంలో ఒక వ్యాపారవేత్త అనే ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ తుంగ

జనసేన పార్టీలోకి పలువురి చేరిక

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్థసారధి నగర్‌కు చెందిన 30 కుటుంబాలు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డిష్‌రాజు, నాయకులు సంంకు అఖిల్, ఆది పాల్గొన్నారు.





కదిరి : స్వామివారి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే కందికుంట, స్వామివారి ఆలయంలో ఎంపీ బీకే





ధర్మవరం : ఉత్తర ద్వారం పల్లకిపై ఆశీనులైన లక్ష్మీచెన్నకేశవుడు, దర్శనానికి బారులు తీరిన భక్తులు

భావములోనా.. బాహ్యమునందును..

గోవిందా.. గోవిందా..

ముక్కోటి ఏకాదశి నేపథ్యంలో ఆలయాలు కిటకిట



పుట్టపర్తి: కోవెలగుట్టపల్లిలో అలంకణలో స్వామివారు



కొత్తచెరువు: లక్ష్మీచెన్న కేశవపురంలో స్వామికి అలంకరణ



ముదిగుబ్బ: మలకవేముల క్రాస్ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో..



తాడిమర్రి: ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



ధర్మవరం : ఇస్కాన్‌లో జగన్నాథుడు, బలరామ, సుభద్ర

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచే స్వాముల వారి దర్శనానికి క్యూకట్టారు. పలు ఆలయాల్లో స్వామివారికి కళ్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ధర్మవరం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం గోవిందనామస్మరణతో మారుమ్రోగింది. స్వామిని దర్శించుకోవడానికి కిలోమీటర్ పొడవునా భక్తులు బారులు తీరారు. ధర్మవరం ఇస్కాన్ భజన మంది రంలో జగన్నాథ, బలరామ, సుభద్ర ప్రతి మలను విశేషంగా అలంకరించారు. కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి నుంచే భక్తులు క్యూ కట్టారు. పల్లకీని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మోశారు. స్వామిని హిందూపురం ఎంపీ బీకె. పార్థసారథి, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొత్తచెరువు మండలం లక్ష్మీచెన్న కేశవపు రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించు కోవడానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పుట్టపర్తి మండలంలోని దేవాల యాలు, ముదిగుబ్బ మండలం మలకవే ములక్రాస్ వద్ద గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, తాడిమర్రిలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి, లక్ష్మీ ఓబుళేశ్వరస్వామి, ఏకపాదం పల్లిలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు, నంబులపూలకుంట మండలంలోని గౌకన పేటలోని రామాలయం, బుక్కపట్నంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం, బత్తల పల్లిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, దంపేట్ల సమీపంలోని చెన్నకేశవస్వామి దేవాలయం, నల్లచెరువు సమీపంలోని పాలపాటిదిన్నె ఆలయం, నల్లమాడ షిర్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నల్లచెరువు: అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి



ధర్మవరం: లింగిశెట్టిపాళ్యం ఆంజనేయస్వామి



బుక్కపట్నం: లక్ష్మీనారాయణ స్వామి మూలవిరాట్



బత్తలపల్లి : వెంకటేశ్వరస్వామి ఆలయంలో అలంకరణ



నల్లమాడ: షిర్డీసాయి బాబా అలంకరణ



ఎన్పీకుంట : గౌకనపేట రామాలయంలో..

సమస్యలు పరిష్కరించాలని దీక్ష



రిలే నిరాహారదీక్షలు చేస్తున్న కార్మికులు

ధర్మవరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యా లయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు శుక్రవారం రిలేనిరాహార దీక్షలు చేపట్టార ఇంజనీరింగ్ కమిటీ నాయకులు లింగరాజు, సూర్యనారాయణ, మున్సిపల్ పాఠశాలల ఆయాల యూనియన్ నాయకులు చౌడమ్మ, జయమ్మ వీరికి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆది నారాయణ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ , పారిశుధ్య కార్మికులు సమస్యల పరిష్కారం కోసం అనేక మార్లు వినతిపత్రాలు అందించిన ఫలితం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికసంఘం నాయకులు అనిల్‌కుమార్, దస్తగిరి, పెద్దన్న, కాటమయ్య, బాబు, సురేశ్, పారిశుధ్య కార్మికసంఘం నాయకులు కేశవ, రామకృష్ణ, ఓబుళపతి, ఓబుళేశు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తిరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అనుపమకు వినతి పత్రం అందచేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. పేదలకు గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం మంజూరు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఆ హామీ గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మీ సీపీఐ పట్టణ నాయకులు బాషా, గంగాదర్, జయమ్మ పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ

ఓబుళదేవరచెరువు, జనవరి 10(అంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం తహసీల్దార్ అనంతచారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, భాగ పరిష్కారాలు ... తదితర సమస్యలుంటే ఈనెల 20న రీసర్వే నిర్వహిస్తున్నామని, ఆ రీసర్వేలో సమస్యలు విన్నవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, వీఆర్ఓ వాసు దేవరెడ్డి, సర్వేయర్ తాతయ్య, విలేజీ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇసుక డంప్ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

నంబులపూలకుంట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవంకలవారిపల్లి గ్రామ సమీపంలో ఇసుక డంప్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. దాదాపు అక్కడ వెయ్యి టిప్పర్ల ఇసుక ఉండటాన్ని గమనించారు. ఎందుకు ఇక్కడ ఇంత ఇసుక ఉంచారని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌తో ఆరా తీశారు. కడప జిల్లాలోని గాలేరు, నగరి తాగునీటి పనుల్లో భాగంగా గతంలో ఈ ప్రాంతంలో ఇసుక డంప్ ఏర్పాటు చేశారని వివరించారు. కడప జిల్లాలో పనులు జరుగుతుంటే ఇక్కడ ఎందుకు ఇసుకను డంప్ చేశారని జేసీ ప్రశ్నించారు. ఇసుకను తహసీల్దార్ ఆధీనంలోకి తీసుకుని, మైనింగ్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం జేసీ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి.. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ వీవీఎస్ శర్మ, వీఆర్ఓ రఘు, సర్వేయర్ జిలాన్, సచివాలయ సర్వేయర్ ఉపేంద్ర ఉన్నారు.

పరిహారం ఇప్పించండి సారూ..



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సోలార్ భూ బాధితులు

నంబులపూలకుంట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టుకు భూములు స్వాధీనం చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పరిహారం ఇవ్వలేదని, వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జేసీ అభిషేక్‌కుమార్‌కు బాధితులు విన్నవించారు శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రాగా రైతులు వినతిపత్రం అందచేశారు. తమకున్న భూములను సోలార్‌కు ఇచ్చామని, పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఉన్న భూమిని కోల్పోయి ఉపాధి లేక, పరిహారం అందక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన చెందారు. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. స్పందించిన జేసీ.. బాధితుల వివరాలను తన కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సూచించారు.

నేటి నుంచి నాన్న దర్గా ఉరుసు

కదిరి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మదనపల్లి రోడ్డులో ఉన్న హజరత్ హైదర్‌సాబ్ వలీ (నాన్న దర్గా) ఉరుసు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి నజీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న గంధం, 12 ఉరుసు, 13న జిఆరత్ నిర్వహిస్తామని, ప్రతిరోజు రాత్రి 10గంటలకు కవాలీ ఉంటుందని వివరించారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీస్ పెరెడ్ మైదానంలో ఈ నెల 26న నిర్వహించే 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజానమస్యల ప్రజావేదిక సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు ఈనెల 17న అందిచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలపై ప్రత్యేక శకటాలను రూపొందించాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, ఎస్పీ వీ. రత్న, డీఆర్ఓ విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, జిల్లాలోని అన్నిశాఖల హెచ్‌ఓడీలు, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

క్రైం న్యూస్ ..

వ్యక్తి ఆత్మహత్య



శివప్రసాద్ (ఫైల్)

ముదిగుబ్బ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీకాలనీ సమీ పంలో మానసిక స్థితి సరిగా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకు న్నాడు. నారాయణస్వామి కుమారుడు శివప్రసాద్ (44) సొంత గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. అతనికి మానసిక పరిస్థితి సరిగా లేదు. వారం రోజుల నుంచి జీవసమాధి అవుతానని, దేవుని దగ్గరికి వెళతానని కుటుంబ సభ్యులతో.. తోటి పశువుల కాపరులతో చెప్పేవాడు. వారు ఎంత సర్దిచెప్పినా మాట వినేవాడు కాదు. గురువారం అర్ధరాత్రి వంటగదిలో అతను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉండటాన్ని అతని భార్య రుశాంతి గమనించింది. అత్తామామలకు సమాచారం అందించింది. వారు పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివప్రసాద్‌కు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలం పూలకుంటపల్లికి చెందిన ఆటో డ్రైవర్ హరిప్రసాద్ మండలంలోని కౌలేపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతను కదిరి నుంచి నల్లచెరువుకు ఆటోలో ప్రయాణీకులతో వెళ్తుండగా కౌలేపల్లి వద్ద ముందు వెళ్తున్న బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇరువర్గాల ఘర్షణ: కేసుల నమోదు

ధర్మవరంరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో చెత్త విషయమై ఇరువర్గాలు గొడవపడ్డాయి. పరస్పరం ఫిర్యాదులతో పోలీసులు కేసులు నమోదు చేశారు. రాంబాబు, రేఖ దంపతుల కుమార్తె ఇంటి ముందర చెత్తను ఊడ్చి ఆ చెత్తను నాగమ్మభాయ్ ఇంటి సమీపంలో వేసింది. దీంతో నాగమ్మభాయ్ రేఖకుమార్తెను తిట్టింది. దీంతో రేఖ కుటుంబ సభ్యులు,నాగమ్మభాయ్ కుటుంబ సభ్యులు ఒకరిపైనొకరు దాడికి పాల్పడ్డారు. దాడిలో రాంబాబుకు గాయాలయ్యాయి. ఇరువర్గాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రేఖ కుటుంబంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

ఐదుగురు బైండోవర్

ఓబుళదేవరచెరువు, జనవరి10 (ఆంధ్రజ్యోతి) : గతంలో సారా కేసుల్లో ఉన్న ఐదుగురిని ఎక్సైజ్ శాఖ వారు తహసీల్దార్ అనంతా చారి ముందు శుక్రవారం బైండోవర్ చేశారు. బైండోవర్ చేసిన వారు సత్‌ప్రవర్తనతో కలిగి ఉంటామని, సారా అమ్మబోమని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీపై అవగాహన

పుట్టపర్తిరూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే హెచ్‌ఎంపీవీ వైరస్ (హ్యూమన్ మెటా నిమో వైరస్) బారిన పడకుండా ఉండవచ్చని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ సూచించారు. మండలంలోని వెంకటగారిపల్లిలో హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాస్కు ధరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవమ్మ, సూపర్వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్‌ఎంపీవీపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ

న్యూస్ బాక్స్

ప్రమోషన్ ఇవ్వకుండా కొత్త నోటిఫికేషనా?

హిందూపురం అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పది నుంచి 15 సంవత్సరాలు చాలా మంది హెల్పర్‌లు హెల్పర్ లుగానే ఉన్నారని, వారికి ప్రమోషన్ ఇచ్చిన తరువాత నోటిఫికేషన్ విడుదల చేయాలని అంగన్‌వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వినతిపత్రం అందించారు. శుక్రవారం పత్రికల్లో వెలువడిన నోటిఫికేషన్‌చూసి ఆశ్చర్య పోయామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి శోభ, అధ్యక్షురాలు అరుణలు మాట్లాడుతూ చాలా ఏళ్ళుగా అనుభవం ఉన్న ఆయాలు ఆయాలుగానే నిలిచిపోయారన్నారు. ఇప్పుడు కొత్తగా విడుదల చేసిన వర్కర్ పోస్టులకు ఆయాలను ప్రమోషన్‌పై పంపి తరువాత మిగిలిన వాటికి నోటిపికేషన్ ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు భారతి, నాగమ్మ, జయమ్మ, ఆశ, తహసీనా, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యాలు అదరహో..



నృత్యం చేస్తున్న చిన్నారులు

హిందూపురం అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 41వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు అబ్రహం కుట్టియాంకల్, దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ బలరాంరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు, మునిసిపల్ కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ డీఈ రమేష్‌కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. దీప్తి పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు, కరాటే తదితర వాటిని కూడా నేర్పిస్తున్నారన్నారు. ఎవరికి ఏ రంగాంలో ప్రావీణ్యం ఉంటే ఆ రంగంలో రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైల్వేలైన్‌కు భూసేకరణపై గ్రామసభ

గోరంట్ల, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లిలో రైల్వేలైన్ ఏర్పాటుకు భూసేకరణపై రెవిన్యూ అధికారులు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో రైతులు తమ సమస్యలను తెలిపారు. నాసిన్ ఆకాడమి కోసం హిందూపురం సమీపంలోని మల్లాగూరు నుంచి పాలసముద్రం వరకు కొత్తరైల్వేలైన్ ఏర్పాటు చేయ నున్నారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ రైతులకు పరిహారం అందించే విషయం, తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహమూర్తి, తహసీల్దార్ మారుతి, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్వోలు, రైతులు ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పథకానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పథకం ద్వారా యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ చేయడానికి టాప్-500 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి. వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ముస్తఫ కార్సినోమ క్లియర్‌సెల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. లక్ష మందిలో ఒకరికి వచ్చే వ్యాధి ఈయనకు సోకడం చాలా బాధాకరమని ఎంఈఓ నాగరాజునాయక్ అన్నారు. 15సంవత్సరాల నుంచి ఆయన విద్యార్థులకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఇప్పటికే 20లక్షలకుపైగా ఖర్చుచేసినట్లు ఆయన తెలిపారన్నారు. తోటి సిబ్బంది స్పందించి ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.2లక్షలు పోగుచేసి శుక్రవారం ఆయనకు నగదును అందజేశారు. త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పురవీధుల్లో ఊరేగిన వాసవీమాత



పురవీధుల్లో ఊరేగుతున్న వాసవీమాత

పెనుకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వ హించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో పురవీధుల గుండా ఊరేగించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు సంక్రాంతి ముగ్గుల పోటీలు

పావగడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో 12న ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు సాయిబాబా ఆలయం ముందున్న మైదానంలో సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించి న్యాయనిర్ణేతలు నిర్ణయించిన వారికి 1, 2, 3 బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.5001, రెండో బహుమతిగా రూ.3001, మూడో బహుమతిగా రూ.2001 ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు ముగ్గులపోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుకోవాలన్నారు.

దుర్లభం.. ఉత్తరద్వార దర్శనం

● వైకుంఠ ఏకాదశి సందర్భంగా కిటకిటలాడిన వైష్ణవాలయాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవాలయాలు శోభాయమానంగా ముస్తాబైనాయి. ఆలయాల్లో మూల విరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూలు నగలతో సర్వాంగ సుందరంగా, చూడముచ్చటగా ముస్తాబు చేశారు. అదే విధంగా ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉత్తర ద్వారం వద్ద ఉంచగా, దాని కింద నుంచి భక్తులు దూరి వచ్చి దేవతా మూర్తులను సేవించుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మకడశిర తదితర చోట్ల గోవిందనామ స్మరణతో పరిసర ప్రాంతాలు పులకించాయి.



విద్యానగర్‌లో ..





లక్ష్మీపురం బాలాజీ ఆలయంలో...



పెనుకొండలో ఉత్తరద్వారం ద్వారా దర్శనానికి వెళ్తున్న భక్తులు



గోరంట్ల వాసవీమాత ఆలయంలో...



చిలమత్తూరులో..





పావగడలో వెంకటేశ్వరస్వామి





టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



అగళిలో..

సచివాలయాల్లో పనిచేయని ఫైబర్ నెట్‌వర్కు

సేవలు అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు

మడకశిరరూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైసీపీపాలనలో సచివాలయాలకు ఎంతో ఆర్భాటంగా లక్షలాది రూపాయలు వెచ్చించి ఏపీ ఫైబర్ నెట్ వర్కు ఏర్పాటుచేశారు. దీంతో గ్రామీణ ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించవచ్చునని సచివాలయ సిబ్బంది అప్పట్లో ఆనందం వ్యక్తంచేశారు. ఫైబర్ నెట్‌వర్కు పరికరాలు అమర్చి రెండేళ్లయినా నేటికీ అవి పనిచేయడంలేదు దీంతో సిబ్బంది సొంత ఖర్చులతో నెట్ వర్కువేయించుకొని పనులు చేస్తున్నారు.

మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అన్నింటికి ఏపీ ఫైబర్ నెట్ వర్కు పరికరాలు అమర్చారు. వాటికి నెట్ వర్కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి సచివాలయాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. సరిహద్దు గ్రామాల్లోని కొన్ని చోట్ల నెట్ వర్కు పనిచేయడం లేదు. దీంతో ప్రతి రోజు ఎంతో మంది పని జరగక వెనుదిరుగున్నారు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేక పోవడంతో ప్రజలకు సేవలు అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని సచివాలయాల్లో ఉన్న ఏపీ ఫైబర్ నెట్‌వర్కు పనిచేసే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పనిచేయని ఫైబర్ నెట్‌వర్కుతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగి

నెట్‌వర్కు సేవలు అందించేందుకు చర్యలు : సోనియాబాయి

గ్రామసచివాలయాల్లో ఏపీ ఫైబర్ నెట్ వర్కు సేవలు అందించేందుకు చర్యలు తీసుకొంటాం ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళతాం.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిర రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా పనిచేస్తున్నాట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బుళ్ళసముద్రం గ్రామంలోని గంగరత్నమ్మ అనే మహిళ రైతు రూ.1.85 లక్షలతో నిర్మించుకొన్నా గోకులం షెడును ప్రాంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబంలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

హిందూపురం:రైతులకు బాసటగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హిందూపురం మండలంలోని బేవనహళ్లి, కిరికెర, చిలమత్తూరు, మండలం బ్రహ్మేశ్వరంపల్లి గ్రామాల్లో రైతులు నిర్మించుకున్న గోకుల షెడ్లను రిబ్బన్ కట్‌చేసి కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన గోకుల షెడ్లను రైతులు నిర్మించుకున్నారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన ఎంపీడీఓ

అమరాపురం: మండల పరిధిలోని నాగోనపల్లి గ్రామం, పుల్లీకుంట గ్రామంలో గోకులం షెడ్డులను ఎంపీడీఓ రామారావు, మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గోకులం షెడ్డును నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు.



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న గుండమల తిప్పేస్వామి

పరిగి మండలంలో..

పరిగి: మండలంలోని బసవనపల్లి, ఊటకూరు గ్రామ పంచాయతీలో పల్లె పండుగ సందర్భంగా గోకులం షెడ్డును ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మండల కన్వీనర్ గోవిందరెడ్డి హాజరై ప్రారంభించారు.

రొళ్ల: మండలంలోని రత్నగిరి గొల్లహట్టి గ్రామంలో శుక్రవారం గోకులం షెడ్డును మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు గురుమూర్తి, కిట్టన్న, ఈరన్న, వెంకటేష్, టీఏ మారేగౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణంలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని సూచించారు. సర్వే నంబరు 700లో తొలగించిన ఇళ్లను పునర్‌నిర్మించి ఇవ్వాలని పట్టాలు అందించాలని వినతిని అందించారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భైరవేశ్వర దేవాలయంలో గుప్తనిధుల తవ్వకాలు

అగళి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అగళి మండలం హెచ్‌డిహళ్లి గ్రామ పంచాయతీ సమీపంలోని భైరప్ప భైరవేశ్వర దేవాలయం దగ్గర గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధులు తవ్వడానికి వెళ్లి మూడు విగ్రహాలను పగలకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై అగళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

18న లలితకళాపరిషత్‌లో నృత్యప్రదర్శన

అనంతపురం అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లలిత కళా పరిషత్‌లో 18వతేదీన ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

ఏఐయూ కాన్ఫరెన్స్‌కు ఎస్కేయూ వీసీ

అనంతపురం సెంట్రల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్ - వన్ ఎగ్జామ్ అనే అంశంపై నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత వెళ్లారు. శుక్రవారం వేలూరు వీఐటీలో నిర్వహించిన ఆల్ ఇండియా సదస్సులో వీసీ పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బొలేరో..



డివైడర్‌ను ఢీకొన్న బొలేరో వాహనం

పరిగి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బొలేరో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్నాటక పావగడ తాలూకా పిల్లలపల్లి గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి టమోటా లోడును కోలార్‌కు తీసుకెళ్లి శుక్రవారం తిరిగి వస్తుండగా మండల పరిధిలోని నేతులపల్లి జయమంగళి నది బ్రిడ్జిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బొలేరో నడుపుతున్న రవికి కాలు విరిగింది. స్థానికులు గమనించి 108సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

సోమందేపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తాపడిన సంఘటనలో మిలింద్ భార్య స్మిత, కుమార్తె నిధిలు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరుకు చెందిన మిలింద్ కుటుంబ సభ్యులు మంత్రాలయానికి కారులో బయలుదేరారు. సోమందేపల్లి సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై ఫ్రెంట్‌వీల్ ఆక్సెల్ కట్ కావడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. అయితే ప్రమాద సమయంలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో కారు నుజ్జు నుజ్జు కావడంతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న ఎఎస్ఐ మురళి, సిబ్బంది కారును ఎక్సకవేటర్ సాయంతో పక్కకు తొలగించారు. క్షతగాత్రులను పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

పెనుకొండ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని మడకశిర రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భవన కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన భవన కార్మికులు మడకశిర రహదారిలో పనికోసం నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో షీప్‌ఫారం నుంచి పెనుకొండ వైపు వేగంగా వస్తున్న కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భక్తర్, మున్నా, సైఫుల్లాలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెనుకొండ, రొద్దం మండలాల్లో ఖాళీపడ్డ అంగనవాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ డా.శాంతలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. రొద్దం మండలం చెరుకూరు-1 అంగనవాడీ కార్యకర్త (బీసీబీ), బూచర్లలో మినీ అంగనవాడీ కార్యకర్త పోస్టు(ఓసీ), రొద్దం -2 (బీసీబీ), మోపర్లపల్లి (ఓసీ), పెనుకొండ పట్టణంలోని తోటగేరి (బీసీఈ), పోస్టుల భర్తీకి ఈనెల 10నుంచి 25 సాయంత్రం లోపు దరఖాస్తులను పంచాయతీ వార్డు పరిధిలోని సచివాలయాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో సమర్పించాలన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై స్థానికంగా ఉండి వివాహితులై ఉండి 21నుంచి 35సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలన్నారు.